


అనివార్య కారణాలవలన దేశంలో ఎలక్షన్లు హడావుడిగా వచ్చేసాయి! ఆ ఎలక్షన్లలో ఒక నియోజక వర్గంనుండి అయోమయరావు మరియు అనామకరావు అలవాటు ప్రకారం పోటీ చేస్తున్నారు. ఇద్దరూ ప్రతీసారి ఎలక్షన్‌లో ప్రత్యర్థులే.

అయోమయరావుకు చిన్నప్పుడు స్కూల్లో హైజంప్‌లో ఫస్టు ప్రైజ్ వచ్చింది. ఆ జంపింగ్ టెక్నిక్ రాజకీయాల్లోకి దిగినా పోలేదు. అతడు మొదట 'గద' గుర్తు పార్టీలో చేరి రాజకీయరంగ ప్రవేశం చేసాడు. తర్వాత ఎలక్షన్‌లో ప్రజల మొగ్గు 'చక్రం' గుర్తు పార్టీ మీద వుందని గ్రహించి, ఆ పార్టీలోకి జంప్ చేశాడు. ఆ తర్వాత శంఖు గుర్తు వేపు ప్రజల గాలి మళ్ళిందని కని

పెట్టి అందులోకి దూకేసి, పార్టీ నాయకుడై పోయాడు.

ఈసారి ప్రజల మొగ్గు ఏ పార్టీ వేపూగాక ఇండిపెండెంట్ల మీదే వుందని గ్రహించి, దేశనాయకులు చాలామంది పార్టీలకు రాజీనామాలు చేసేసి, ఇండిపెండెంట్లుగా పోటీచేస్తున్నారు. శంఖు గుర్తు పార్టీలో సభ్యులంతా రాజీనామా చేసేసాక పార్టీనాయకుడైన అయోమయరావు ఒక్కడే ఆ పార్టీలో మిగిలాడు. అతడు తానుకూడా ఇండిపెండెంటుగా పోటీ చేయదలచి, పార్టీకి తనే నాయకుడయినందున రాజీనామా పత్రాన్ని ఎవరికి పంపించాలో తెలియక అమెరికా అధ్యక్షుడికి పంపించాడు!

అనామకరావుకి పేకాట పిచ్చి ఎక్కువ. ఇటు మూడు ముక్కలాట, అటు పదమూడు ముక్కలాట రెండు చేతులా ఆడుతూ వుంటాడు. నిద్దట్లో కూడా మూడాసులు, ఆరాసులు అని కలవరిస్తూంటాడు. అతడికి బాగా చిన్నప్పుడు ఒక క్రీష్టియన్ పాదర్ని, "నేను ఏంచేస్తే పైకొస్తాను?" అని అడిగాడు. "నువ్వు ఏసుని నమ్మాలి" అని చెప్పాడాయన. అప్పటినుండి అనామకరావు ఏస్ (ఆసు) గుర్తు పార్టీని పెట్టి రాజకీయాల్లోకి దిగాడు. మెంబర్లను చేర్చాడు. కాని ఆ పార్టీ గుర్తుమీద ఇప్పటిదాకా గెలువలేదు.

ఎన్నికల సభల్లో ఉపన్యాసాల్లో ఉద్రేకం తారస్థాయిని చేరింది. అనామకరావు అయోమయరావుని చీల్చిచెండాడాడు. "ఆ అయోమయ రావుని నమ్మకండి! వాడి బుర్రంతా అయోమయం. కట్టుకున్న పెళ్ళాన్నయినాసరే మిడిల్ డ్రాప్ చేసేసి గంగలో వదిలేసే రకం! మీరు వాడికి అధికారం కట్టబెడితే ప్రజాశికల ఖర్చెంతో సరిగా కౌంట్ చెప్పడు బద్మాష్. మూడు ముక్కలాటలో మీరు కలవరించే 'ఆసు' పార్టీ మాది. మన చేతిలో ఎన్ని ఆసులుంటే, అంటే ఎంతమంది 'ఆసు' మెంబర్లును- గెలిస్తే దేశం అంత సుభిక్షంగా ఉంటుంది. దేశం ఇప్పుడు ఏసీ, డీసీ లో ఉంది. ఆసు గుర్తును గెలిపిస్తేనే దేశం 'షో' చూపించగలుగుతుంది" ఇదీ అతడి ఉపన్యాసం.

అయోమయరావు కూడా ప్రచారంలో తక్కువేం తినలేదు. "ఆ అనామకరావు ఒట్టి జూదగొండి. మూడు ముక్కలాటలో ఆసు కనిపిస్తే చాలు, పెళ్ళాన్ని కూడా తాకట్టు పెట్టేస్తాడు. అలాటివాడు

దేశాన్ని మట్టుకు మిగులుస్తాడా? అతడికి దేశాన్ని పాలించడమంటే పేకాడుకున్నట్టే! (జనం నవ్వులు) నేను చూడండి! మీకోసం ఎన్ని పార్టీలు మార్చాను? ఎన్ని త్యాగాలు చేసాను? ఇదంతా ఎవరికోసం? ప్రజలకోసం! ప్రజలకోసం నా పార్టీనే వదులుకొని, ఇప్పుడు ఇండిపెండెంటుగా పోటీ చేస్తున్నాను. నన్ను గెలిపించి దేశాన్ని రక్షించే భారం మీదే" అన్నాడు.

ఇలాంటి తీవ్రమైన వాగ్యుద్ధాల మధ్య ఎన్నికలు ముగిసాయి! అసు పార్టీ తరఫున నిలబడ్డ అభ్యర్థులందరూ ఓడిపోయారు. అన్ని చోట్లా ఇండిపెండెంట్లే గెలిచారు!

పార్లమెంటులో పార్టీలు పోయినా, ముఖాలు మళ్ళీ పాతవే కనిపించాయ్! వారందర్నీ అయోమయరావు కూడగట్టుకొని తన నాయకత్వంలో 'ఇండిపెండెంట్ల'మంటూ తను 'విశ్వరూప దర్శనం' ఇచ్చేసరికి ఈసారి ప్రజలు భయంతో కళ్ళు మూసేసుకొన్నారు. ●

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే- నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

రచయితల సౌకర్యార్థం మాకు అందిన ఏ కథైనా వారం రోజుల్లోపల, ఏ నవలైనా రెండు వారాల లోపల ప్రచురించేదీ లేనిదీ తెలియజేయగలం. -ఎడిటర్.

రచనలు పంపవలసిన చిరునామా:

'విజయ'
80-ధనలక్ష్మి కాలనీ,
మద్రాసు-600 026.